"ఇతర విషయాలు ఆలోచించలేదు నానమ్మా! పక్కింటి రాము ఆటవస్తువులన్నీ నేను దాచేసాను. అది గుర్తు రావడంతో మళ్ళీ వాళ్ళింటికి వెళ్ళి వాటిని యథాస్థానంలో పెట్టేసి వస్తున్నాను." జవాబు చెప్పాడు మనవడు.

మనం చేసే ప్రార్థనలు కూడా ఇలాంటి ఫలితాలని ఇస్తూంటేనే మనం సరైన ప్రార్థనని చేసినట్లు.

## 122. జ్ఞాపకార్థం

ఏక్సిడెంట్‌లో మరణించిన తన కొడుకు జ్ఞాపకార్థం, ఒకతను కాశీలో కట్టే ఓ సత్రంలోని ఓ గదికి పెద్ద మొత్తాన్ని చందాగా ఇచ్చాడు. అక్కడున్న ఓ యువతి వెంటనే తన భర్తతో గొంతు తగ్గించి చెప్పింది.

"మనం కూడా మన అబ్బాయి జ్ఞాపకార్థం అంతే మొత్తం ఇద్దాం."

"నీ కేమైనా మతి పోయిందా? మన కొడుకు బ్రతికే ఉన్నాడుగా?" చిరుకోపంగా చెప్పాడు భర్త.

"అందుకనే. మనకా గర్భ శోకం ఇవ్వనందుకు కాశీ విశ్వనాథుడికి కృతజ్ఞతగా ఓ గదిని కట్టిద్దాం." చెప్పిందా తల్లి.

## 123. ఆనందం మీ వెంటే

ఓ పిల్లి తన తోకని అందుకోవాలని విశ్వప్రయత్నం చేయసాగింది. కాని అది దానికి సాధ్యం కాలేదు. ఇంకో పిల్లి వచ్చి దాన్ని చూసి అడిగింది.

"ఏం చేస్తున్నావు?"

"నా తోకని అందుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను."

"ఎందుకు?"

"అందువల్ల నాకు ఆనందం లభిస్తుంది కాబట్టి."

"ఒకప్పుడు నేను కూడా నీలాగే నా తోకలో ఆనందం వుందని భావించి దాన్ని అందుకోడానికి ప్రయత్నించాను. అది నావల్ల కాలేదు.